

# రెప్పచాటు ఉప్పెన

సి. సుజాత

వరలక్ష్మికి ముందుగా సిగ్గేసింది. తరువాత వళ్లంతా ఆవిర్లు వచ్చినట్లనిపించింది. ఎంత వద్దనుకొన్నా కళ్లు కిందికి వాలిపోయాయి. మళ్లీ ఒకసారి అటు చూడమని మనసు హెచ్చరించింది. కిటికీ సువ్వలు గట్టిగా పట్టేసుకొంది. నెమ్మదిగా తల చల్లని సువ్వలకు ఆన్చింది. కళ్ల వెంట ఇంక ఆగని కన్నీళ్లు ముత్యాల్లా కిందికి జారేయి.

అంతకుముందే దూరంగా మామిడిచెట్టు కింద మంచమ్మీద పడుకొని చదువుకొంటున్న శాంత దగ్గరికి చంద్రం పిల్లిలా వచ్చాడు. వంగి ఆమె బుగ్గ మీద నెమ్మదిగా ముద్దెట్టుకున్నాడు. చేతిలో పుస్తకం విసిరి పారేస్తూ ఆవిడ గారాలు పోయింది.

ఇంతే... ఇంతేనా... ఇంతేకదా జరిగింది? మరి ఈ చల్లని సువ్వలకు ఆన్చిన బుగ్గలను ఎప్పుడేనా, ఎవరైనా పరామర్శించారా! వెచ్చని ఊపిరి తన మెడ కింద తగిలిందా? 'వరలక్ష్మీ ఇంచక్కని రంగెలా వచ్చిందే నీకూ... గంధంగిన్నెలా ఘుమ ఘుమలాడుతున్నావెందుకే,' అని అడిగారా? మరి అడగరు... వరలక్ష్మి తిరస్కారంగా వంటింటి ముందుగా ఉన్న వరండా వైపు చూసింది. ముక్కు మూసుకుని గాయత్రీ చదువుతూ కాస్త వెనక్కు ముందుకూ ఊగిపోతూ, పొట్ట కదిలిపోతున్న శాస్త్రుల్లు అన్నాడు.

"ఇదిగో వరం... మీ అమ్మకి 30 వేల వరకూ ఆస్పత్రిలో తగలేశాను. అవన్నీ నేను పట్టించుకోలేదనుకో. పాపం ఆవిడ అల్లా వెళ్లిపోయింది. ఘటన 40 ఏళ్లకే ఆయుస్సు అయిపోయింది. సరే నువ్వు మిగిలావు. పిల్లల్ని కనిపెట్టుకు పడుండు. నీ జీవితం ఈ పంచని వెళ్లమార్చుకు... ఇదిగో తర్వాత నన్నంటే లాభం లేదు. నేను ఆపరేషన్ చేయించుకున్నా నాకిహ పిల్లలు కలగరు. ఉన్నదే నీ సంతానం అనుకో. ఒకవేళ నేను ఆపరేషన్గానీ చేయించుకోకపోతే వరసాగ్గ సంవత్సరానికోళ్లు."

రెండు మూడు పళ్లు ఊడిపోయిన వికారపు మూతి సరసం. సాయంత్రం వేళల స్నానం ఎరుగని శుభ్రత. పిల్లలంతా నిద్రపోయాక... దొంగ పిల్లిలాగా వచ్చి అప్పుడు పెనుగులాట. తనకయితే అవసరంలేదట. కేవలం వరలక్ష్మి శ్రేయస్సు కోరేనట... ఛీ... ఛీ... వద్దే వద్దు. ఆ దరిద్రపు కోరిక నాకు వద్దేవద్దు. ఈ పిల్లల చాకిరి కోసమే ఈ ఇల్లు నాకు నీడనిచ్చింది. అంతేనమ్మా అంతే... వారాలు, నెలలు. సంవత్సరాలు అదేమిటో గిర్రుగిర్రున ఎలా తిరిగిపోతున్నాయో.

"ఇదిగో అత్తయ్యా కాఫీ ఇస్తావు. అయ్యో పొయ్యి మీద ఏదో పొగ వస్తోంది."

గుమ్మం దగ్గర చంద్రం దొంగ నవ్వులు నవ్వుతున్నాడు.

ఔను మాడిపోయింది. పప్పేగా. పోనీ... అచ్చం నా ఆశల్లాగే మాడిపోనీ అనుకుంటూ వరలక్ష్మి నుదుటి మీద చిరుచెమటలు చెంగుతో తుడిచేసుకుంది. తన ఆలోచనలనెవరయినా కనిపెడతారో ఏమో!

డికాషన్ గిన్నెలో పాలు కలిపి అతని చేతికి ఇస్తూ, "మీ ఆవిడేదోయ్" గాంభీర్యంగా మాట్లాడబోయినా మళ్లీ మొకం మీదికి నవ్వులు వచ్చేస్తున్నాయ్. కాఫీ పోసిన గ్లాసు వణికిపోకుండా వుంటే మేలు.

'తగులుతుందా... అతని చేయి తగులుతుందా?'

చంద్రం ఆవిడ వంకే దీర్ఘంగా చూశాడు. మనసులో నవ్వొస్తోంది. 'ఎలా చూస్తోందో. అబ్బ ఈవిడ కళ్లలో

ఎంత ఆశో. నలభై దాటి ఉంటాయి. పచ్చని రంగూ... బుగ్గలూ... బుజాలు... వారెవ్వా... శాంత చిన్నది. సన్నగా ఉంటుంది. ఈవిడయితే...' చంద్రం మొహంమ్మీదికి నవ్వు చేరింది.

వరలక్ష్మి కంగారుపడింది. అనుమానంగా అతని వైపు చూసింది. దీక్షగా తనవైపే... ఇతనికి తెలిసింది. తెలిస్తే బావుండు. ఏం బావుండూ? తన్నీ తగలెయ్యరూ తనని, ఎక్కడికి పోతుందీ? వరలక్ష్మికి చెమటలు పోశాయి. గ్లాసు అందుకుని మొహం తిప్పుకుని లోపలికి వెళ్లిపోయింది. స్టవ్ మండుతోంది. చేతులు మొహం కళ్లు దహించుకోవాలనిపిస్తోంది. కోరిక ఇంత చెడ్డదా? తనకెలా తీరుతుందో. ఎవరైనా తన మనసులో ఆలో చనలు గ్రహిస్తే ఇంకేమైనా ఉందా? పరువు ప్రతిష్ఠ, తన చేతుల్లో పెరిగిన ఆరుగురు పిల్లలు. ఇద్దరు కొడుకులు, నలుగురు కూతుళ్లు, కోడళ్లు, అల్లుళ్లు! వండీ వార్చీ కడిగీ తుడిచీ... పెళ్లిళ్లూ, పేరంటాలు, పురుళ్లూ, పుణ్యాలు ఇంతేనా! ఇంకేవీ లేవా? పోనీ ఒక్కసారంటే ఒక్కసారి ఈ చంద్రం ఎంత బావున్నాడో. ఏం కళ్లబ్బా అవీ... గడ్డం పెంచుతాడు. ముట్టుకుంటే గరుగ్గా ఉంటుందా? నా మెడ కింద ఇలా ఆన్చితే ఏమనిపిస్తుంది. అప్పుడు, సన్నగా వంకర గీతలాగా కని పించే ఆ బుల్లి పెదవులని ముద్దాడితే ఎలా ఉంటుందో. ఇంట్లో శాంతకిలాగా ఎగిరిపడతానా?

వరలక్ష్మి తట్టుకోలేకపోయింది. భగభగ మండే మంటకి చేయి ఆన్చింది. తెల్లటి చేయి నిమిషంలో నల్లగా కమిలిపోయింది. పళ్లు బిగించింది. వరలక్ష్మి వేళ్ల కొనలు తప్పించి చెయ్యంతా మాడిపోయింది. అప్పుడు అరిచింది గట్టిగా గాయపడిన పక్షిలాగా, దెబ్బ తగిలిన జంతువులాగా. 'అదేవిటి పిన్నీ. అదేమిటలా? ఇల్లా రండ్రోయ్. ఒరే అన్నయ్యా, వదినా పిన్ని చేయి కాలిపో యిందిరా...'

ఏవయింది! ఎందుకయింది? అయ్యో మాడిపో యిందేవిటి? దానికేవయిందర్రా... మాట్లాడరేం? పక్ష వాతంతో ఒక కాలు చేయి సరిగ్గా లేని శాస్త్రులు గబగబా నడవలేక వరండాలోనే అరుపులు మొదలుపెట్టారు. పిల్లలందరిలోకి ఆఖరిది చిట్టితల్లి శారద వెన్నగిన్నెతో వచ్చింది. ఆ పిల్ల కళ్లలో నీళ్లు నిలిచాయి. ఏనాడూ కసురుకోనైనా కసురుకోని తల్లి కాలేని తల్లి వరలక్ష్మి పడుతున్న బాధ చూసి భగభగమని మండే చేతిమీద చల్లని చేత్తో వెన్న రాస్తోంది శారద. సరే... ఇది చేతి మంటకి ఉపశమనం. మరి మనసులో మంటకీ!

శాస్త్రుల్లు ఈడుస్తూ వచ్చాడు.

"అంత వళ్లు పై తెలియకుండా ఎట్లా వుంటావే నువ్వూ. మనసక్కడ ఉండదా ఏం. బావుంది రేపు ఇంట్లో శుభకార్యం పెట్టుకుని, చేయి కాల్చుకుని ఏడుపులు మొదలెట్టావూ. నీ కడుపున పుట్టిన పిల్లల యితే నీకు మమకారం పుట్టేది. ఎప్పుడూ ఇంట్లో శోకాలే. కాస్త మందేదో చూడండర్రా... ఇదంతా నా తలరాత."

వరలక్ష్మి పెదవుల మీదికి నవ్వొచ్చింది. శారద కిందికి చూసింది. శారద కళ్లల్లో నీళ్లు జలజలమని రాలి పడుతున్నాయి. ధగధగలాడిపోతున్న బంగారు గాజుల మధ్యని ఎర్రని పువ్వులగాజులు సన్నని సవ్వడి చేస్తుంటే తల వంచుకుని కళ్లనీళ్లు పెట్టుకొంటూ వెన్న రాస్తోంది. "ఆ... నా చేయి కాస్త కాలితే పండుగలు ఆగిపోతాయి కాబోసు. ఇవ్వాల్టికి తల్లి లేని పిల్లయిపోయిందా మీ శారద. నాకు పుస్తె ముడేసిని రోజు సవితి తల్లి దాపురి స్తోందని తెలీదా? తీపరమా? అందుకే ఆ నోరు పడిపో యింది. తొస్సి తొస్సిమంటూనూ. అందుకే పక్షవాతం వచ్చింది..."

వరలక్ష్మి నోటికి ఇంక తాళం పడదని పిల్లలకు తెలుసు. ఒక్కోళ్లు బయటకు పోయారు. ఈడ్చుకుంటూ ముసలాయన కూడా. చిట్టితల్లి శారద పిన్ని చేయి వదల్లేదు. వరలక్ష్మి ఇంకా గొణుగుతూనే ఉంది.

"మా అమ్మ చావుకి ఖర్చు పెట్టేవూ... ఆవిడ చేతి వంట పాతికేళ్లు మింగలా... మీ అమ్మ కడుపుకాలా... నా మీద జాలిలేదట్రా నీకు. ముసిలి చచ్చినాడా. నా గొంతు కోశావు," వెన్న రాస్తున్న చిట్టితల్లి చేయి వణి కింది. పిన్ని ఇంక ఈ అల్లరి ఆపదు. కనీసం రెండు రోజులయినా ఇల్లు శవం వెళ్లినట్లుగా మార్చి పారేస్తుం దేమో. వరలక్ష్మి తిట్లు ఆపి శారదవైపు చూసింది.

'మధ్యన పిల్లేం చేసింది. భయపడిపోతోంది. పాపం... రేపే దీనికి శోభనం. ఎంత పనుంటుందో. అన్యాయంగా చేయి కాల్చుకున్నానే.'

శోభనం గురించి తలుచుకోగానే చప్పున వరలక్ష్మి చెవులు వేడెక్కాయి. కాసేపు వచ్చిన ఉద్రేకమూ చప్పున దిగిపోతోంది. శారద చేతిలో గిన్నె ఊడలాక్కుంది వరలక్ష్మి. "ఫో... ఆ చెట్టుకింద మీ అక్క పవళింపు సేవ చేస్తోంది. పోయి గోరింటాకు పెట్టించుకో ఫో. ఇందాక రుబ్బి ఆ రోటి మీద కొబ్బరిచిప్పలో పెట్టా..."

శారద మాట్లాడలేదు. ఇంట్లో ఏలోటూ చేయదు. కానీ ఈవిడ ఇట్లా ఎందుకు హింసపడుతూ ఉంటుందో శారదకు అర్థం కాలేదు. ఒంటిమీద నగలున్నాయి.

ఎప్పుడూ పట్టుచీరలే కడుతుంది. హాయిగా వండుకొని తిని, పదిమందికీ పెట్టి... కలుపుగోలుగా వుండే ఈమెకి మధ్యమధ్యన ఏమవుతుందీ? ఆ పిల్లకి ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

పోనీ నాన్న మీద కోపం ఎంచేతో అనుకుంది.

'మరి చచ్చే చాకిరీ చేస్తుందే ఆయనకు. ఆ పక్షవాతం మనిషికి. ఆయన తిట్లు, ఆయన నోరు... అమ్మోమ్మో ఎవరూరుకుంటారు. ఆవిడ తప్ప... తనని కాదన్నట్టు... భరించే శరీరం తనది కానట్లు... అంతలా ఎల్లా ఓర్చుకుంటుందో పాపం...' ఇక ఆలోచించలేక, రోటి మీద పెట్టిన కొబ్బరిచిప్ప పుచ్చుకుని అక్క దగ్గరికి పోయింది శారద. వరలక్ష్మి కాసేపు చూస్తూ కూర్చుంది. వంట సగం పైగా అయింది. ఏం చేయాలనిపించదు. చేయకుండా వుంటే ఆలోచనల దాడి... మండిపోతున్న చేతికి పాత గుడ్డ చింపుకుని కట్టుకుంది. కొబ్బరేసి కూర తాలింపు... చారుపొడి కొట్టి మరిగే చారులో విసిరేసి... అబ్బ ఏం వంట నిమిషంలో వంటయిపోయింది. కాసేపు ఇంకేదన్నా వుంటే బావుండు... వరలక్ష్మి అలవాటుగా వంట గది మధ్యలో దొడ్డివైపుకి వున్న కిటికీ దగ్గరకు నడిచింది. నల్లని సువ్వలు. చలిగాలికి మరింత చల్లనైన సువ్వలు. ఎందుకో తల వాటికి ఆన్చితే ఏదో సేదతీరిన భావన. దొడ్లో చెట్ల కొమ్మల నుంచి చల్లని గాలేదో స్నేహంగా తనని తాకిన అనుభూతి. వరలక్ష్మి కంట్లోంచి వెచ్చని కన్నీటిచుక్క బుగ్గ మీదికి జారింది. మనసు కరిగి కళ్లలోంచి ఇల్లా వచ్చేస్తోందో ఏమో. వరలక్ష్మి సన్నగా నవ్వుకొంది.

*

శారదకు తల రుద్ది పొడుగాటి జుట్టు సన్నగా దువ్వి... ఎంచి పెట్టిన పెద్ద పెద్ద మల్లెమొగ్గలతో జడ కుట్టి మిగిలిన పూలన్నీ మంచంమ్మీద కుమ్మరించింది వరలక్ష్మి... బల్లమీద లడ్లు, కాజాలు, పాలగ్లాసు, మంచి నీళ్ల మరచెంబూ అమరుస్తూ శరీరం యంత్రంలా తిరుగుతోంది.

'ఆ మంచంమ్మీద శారదా... వాళ్లాయనా... ముందు ఏం మాట్లాడుకుంటారో. కొత్తవాళ్లు కదా. ఎట్లా కలుస్తారా ఏమో, శాస్త్రుల్లుని ఎప్పుడో ఊహ తెలిసినపుడు నుంచి తెలుసును. ఆయన పన్నొకటి ఊడితే అరుగు మీద నుంచుని కిందకు ఉమ్మేలేస్తో తనని పిలిచి గుప్పిట్లో ఊడిపోయిన పన్ను ఉంచి జాగ్రత్తగా సైడు కాలువలో పారేయమన్నాడు ఓరోజు. గుప్పిట తెరచి చూస్తే ఊడిన పన్ను. ఎంత రోత పుట్టిందో. అమ్మతో చెపితే 'పోన్లే ముసలాడు,' అనేసింది. అమ్మకు అంట్ల గిన్నెలు కడిగి పెడుతూంటే ఊడిపోయిన ఆ పన్ను తాలూకూ స్పర్శ తగులుతూ ఎంత చీదర పుట్టిందో. శాస్త్రులుని వద్దనేందుకు తనకు ఏవుందీ చదువా? సంధ్యా, ఇల్లా వాకిలా... తల్లా... తండ్రా. ఈ ప్రపంచంలో తన గోరు ఆన్చేంత చోటు కూడా లేదే. ఈ ముసలాడికి పెళ్లామయితే అబ్బో నీ తరం తరంగా! అన్నీ తినచ్చు. పిల్లలున్న ఇల్లు. పిండివంటలూ అవీ దిట్టంగా వండుతారు. వాళ్లంతా తనకన్నా చిన్నేగా పాపం. తనదే పెత్తనం... అప్పుడు ఆలోచించుకొంటే బానే ఉంది. బాగా ఉండక ఏం చేస్తుంది. ఎక్కువెక్కువ పాలు తాగటమూ, ఎక్కువెక్కువ మీగడ తినటమూ... ఇదివరకటిలాగా అమ్మ దాచి ఇస్తే కక్కుర్తిగా దొడ్లో రోటి మీద కూర్చుని... అన్నీ కలిపేసి నమిలి పారేసినట్టు కాకుండా... దర్జాగా వంటింట్లో... ఇంతేనమ్మా పెత్తనమంటే ఇంతే. ఇది కాకుండా ఇంకో సుఖం కోసం మనసు కొట్టుకుపోతుందని నాకు తెలీదమ్మా... తెలీదు. వరలక్ష్మికి కుమిలి కుమిలి ఏడవాలనిపించింది.

సాయంకాలం అయింది. ఉత్సాహంగా ఊగి ఊగిపోతూ మంగళహారతులు పాడేసింది. బంతులాటల్లో అల్లుడ్ని దబాయించింది. ముద్దుగా కూతుర్ని కసిరింది. ముత్తయిదులకు పళ్లు, జాకెట్టు ముక్క వాయనం ఇచ్చి పెళ్లికూతురు తిమ్మిరెక్కిన కాలు జాడించుకుంటూ లేచి నిలబడితే. వరలక్ష్మి చేయి పట్టుకుని గది గుమ్మం వద్దకు తీసుకుపోయింది. గది తలుపులు మూస్తుంటే... గుండెలు అదే పనిగా జల్లుమనటం!

కాళ్లకి రాళ్లు కట్టినట్టు వరలక్ష్మి భారంగా నడుస్తూ వంటింటి గుమ్మం ముందు కూలబడింది. మనసు లోంచి ఏవేవో, ఎప్పటెప్పటివో ఆలోచనలు..

'రెండో పిల్ల మొగుడు భాస్కరం. ఇంకో అమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడు. రెండోది గోలు గోలున ఏడ్చింది. తండ్రీ అన్నలూ చెల్లెళ్లు వరుస వారీగా ఓదార్చారు. "పోనిద్దూ.. మగాడు- నీకేంపోయిందీ... లక్షణంగా మగపిల్లలూ... లంకంత ఇల్లు. బోలెడన్నీ నగలు. అసలు మాట్లాడితే అన్ని హక్కులూ నీకే ఉంటాయి. కాస్త పచ్చపచ్చగా ఉన్నదని అదెవత్తో దగ్గర చేరింది లెద్దూ. భాస్కరంగారికి బుద్ధి కుదిరితే దాన్ని తన్ని తగలెయ్యడా? పెళ్లాం కోసం పరుగెత్తుకు రాడా. ఇల్లాంటివి మామూలేలెద్దు."

అబ్బ... ఎన్నెన్ని మాటలూ... ఎన్నెన్ని ఊరడిం పులో! కన్నవాడినీ కట్టుకున్నవాడినీ శపించుకుంటూ, ఆ లంకంత ఇల్లు ఊడ్చేందుకూ, బోలెడన్ని నగలు భద్రంగా దాచేందుకు, కన్నబిడ్డల్ని సాకేందుకు, ఆ ఇంట్లో ఇల్లాలిగా బతికేందుకు తాళి కట్టించుకున్నం దుకు ఆ హక్కుభుక్తాలు తోటే ఏడుస్తూ రెండోపిల్ల వెళ్ళిపోయింది. భాస్కరం ఈ రెండేళ్లలో మరో ఇద్దరితో కూడా సంబంధాలు పెట్టుకున్నాడు. హక్కుగా ఇంట్లో పడివున్న భార్యను ఏలుకున్నాడు. దానికిప్పుడు ఏడో నెల.

మరి తనకు పోనీ రెండు రోజులేనా సుఖంగా ఉండచ్చని హామీ ఎవరిస్తారో? అప్పుడెప్పుడో పెద్దాడు సత్యం స్నేహితుడి బాబాయి ఒకడు పేరంటానికెళ్లొ స్తుంటే కనిపించి సోది కబుర్లేసుకుని ఇంటివరకూ వచ్చాడు. అరుగుమీద కూర్చుని వచ్చేపోయే వాళ్లను పిలిచి కూర్చోబెట్టుకుని గ్రీకుల తీరుతెన్నులు గురించి వివరిస్తున్న శాస్త్రుల్లు ఆయన్ను గమనించి ముటముట లాడేడు. రెండు రోజులు సాధించి పెట్టాడు. ఇంతకీ ఈ వెంట వచ్చిన బాబాయి వెధవ తనంత ముసలి వాడేనూ...!

వరలక్ష్మి దొడ్లో అలికిడికి గుమ్మంలోంచి తొంగి చూసింది. లంకంత పెరడు. దొడ్లో అంతా చెట్లూ చేమలూ, కూరపాదులూ ఏ దొంగయినా దూకలేదు కదా...? దొంగ కాదు చంద్రం. వెన్నెట్లో బావిగట్టు పక్కన జామచెట్టు వారన నిలబడి ఉన్నాడు. సందువేపు తలుపు తెరుచుకుని వచ్చి ఉంటాడు. శాంత పాపం నిద్రపోయిందేమో.

వరలక్ష్మి లేచి నిలబడింది. కాళ్లు కొంచెం పట్టేసి నట్లున్నాయి. నలభై దాటడంలేదూ అనుకొంది. వరలక్ష్మి లేచి నిలబడడం చూసి చంద్రం పిల్లిలాగా నడుచు కుంటూ వచ్చాడు, నిన్న శాంత చదువుకుంటుంటే వచ్చి నట్లుగానే. వరలక్ష్మి గుండె దడదడ కొట్టుకుంది.

నెమ్మదిగా వచ్చి గరుకుగడ్డం భుజం మీద ఆనిస్తాడా?

వెచ్చని శ్వాస తన మెడకు తగులుతుందా?

వెన్నెల్లోకి రెండడుగులు వేసింది వరలక్ష్మి.

చంద్రం దగ్గరకు వచ్చాడు.

"నేను నిన్ను చూస్తూనే ఉన్నాలే. నాకు అర్థం అయిందిగా... పాపం ముసలి మొగుడు. నువ్వేం చేస్తా వులే. ఇయిగో వీటి కోసమే పట్నం వెళ్లేను..." చేతిలో కండోమ్స్ చూపించాడు. ఒక్కక్షణం వళ్లంతా జలద రించింది వరలక్ష్మికి.

"నీకు మల్లేనే నాకింకో స్నేహితురాలుందిలే మా వూళ్లో. దాని దగ్గరకెళ్లినప్పుడు ఇయ్యి వాడతా. మనకి జబ్బులంటుకుంటాయని భయ్యం. జాగ్రత్తగా వుంటాలే. కడుపో కాలో వస్తే మళ్లీ మన చేతికి చవు రెందుకూ?"

వరలక్ష్మికి చెవులు వినిపించటం మానేస్తే బావుం డుననిపించింది.

వెర్రదానిలాగా అతనివైపు చూస్తూ నిలబడింది.

"ఇదిగో ఇదేసుకొంటే పెద్ద తేడా వుండదు. నీకూ సేఫ్టీగా వుంటుంది. నీకింకా నలభైయ్యేగా... ఇక నీ సంగతి నేను చూసుకుంటానులే..." కండోమ్ చూపిస్తూ వెకిలిగా నవ్వాడతను.

వరలక్ష్మి విగ్రహంలాగా నిలబడింది.

"అట్లా బావిగట్టుకిరా. తడితడిగా ఉంది కదూ. కాస్త ఏదైనా పాత గుడ్డ తెచ్చి అదంతా తుడూ..."

దేనికి సిద్ధమైపోతున్నాడితను...?

వరలక్ష్మికి తన వళ్లంతా రాళ్లతో కొట్టినట్టు అవన్నీ ఫెళఫెళమంటూ కుప్పకూలిపోతున్నట్టు అనిపించింది.

'అంతేనా. ఆ బావిగట్టు మీద. అంట్లగిన్నెలు పడేసిన బావిగట్టు మీద... అవన్నీ కాలితో నెట్టి ఈ కుక్క తనను తాకబోతోందా,' ఆవిడకు వాంతి వస్తున్నట్లని పించింది.

ఇన్నాళ్లూ తన వంట్లోకి ఆవిర్లు వచ్చింది ఈ కార్యక్రమం కోసమేనా?

చిన్న పిల్లతెమ్మెర కూడా తనకోసం మెల్లగా వీచదా? ఒక్క సుగంధపు గాలి కూడా తనకు తగలదా? ప్రేమతో నిండిన రెండు కళ్లు తన కోసం చూడవా? తన ఒళ్లంతా ఇష్టంతో ముట్టుకున్నా తన మనసులో... అందిట్లో దాచిన మమకారాన్ని అందుకునే మనిషి లేడా? జూకామల్లె తీగ కిందికి వాలినచోట వెన్నెల్లో ఆ తీగ చివర్న ఒక మొగ్గ అందంగా మెరిసిన చీకట్లో నిల బడి తనపట్ల కరుణతో కరిగిపోదా. జాలితో ద్రవించి పోతూ తన గుండెల్లో మంటను ఆర్పగలిగే స్పర్శ దొరక నట్లేనా? ఎక్కడా మనసులేని, మమతలేని, ప్రేమలేని, అనురాగం లేని బావిగట్టు శృంగారమేనా తన జీవితేచ్ఛ!

వరలక్ష్మి దగ్గరకు వచ్చి, "పదా..." అంటూ భుజ మ్మీద చేయి వేశాడు చంద్రం. మచ్చల పామేదో భుజం మీదికి జారినట్టు అనిపించింది ఆమెకు. తన మనసే మిటో తనకే అర్థం కాలేదు. మరి చంద్రంమ్మీదికి తనెం దుకు కళ్లు పరుగెత్తించిందీ! అతను శాంతతో మాట్లాడి తేనే తన వళ్లెందుకు పులకరించిందీ? అతనితో సమా

గమం గురించి ఎన్ని రాత్రిళ్లు ఆలోచించి అలసిపోయింది. మరి ఇవ్వాళేమయిందీ? చంద్రమే కాదు... ఇంకోడు... మరొకడు... ఎవరైనా తనకి ఒకటేనా?

"కాదు," వరలక్ష్మి కేక వేసింది. చంద్రం వులిక్కిపడి దిక్కులు చూశాడు.

"నీకేమైనా పిచ్చా ఏమిటే? ఇన్నాళ్లూ నా మీదపడి..."

వరలక్ష్మి చాచిపెట్టి చంద్రం చెంప మీద ఒక దెబ్బ వేసింది.

"దొంగముండా..."

చంద్రం పళ్లు నూరుతూ చేయి పైకెత్తేడు. ఒక్కక్షణంలో వరలక్ష్మి మొహం పేలిపోయేదే.

"చీకట్లో ఎటు వెళ్లారండీ," సందు చివర్ని శాంత గొంతు వినవచ్చింది. చంద్రం పరుగెత్తుతున్నట్లు అటు వెళ్లిపోయాడు.

వరలక్ష్మి కాస్సేపు అక్కడే నిలబడింది. నెమ్మదిగా వెనక్కి వచ్చి అలవాటైన కిటికీ మీద చేతులు వేసి సువ్వలకు తల ఆన్చింది. చల్లని సువ్వలు బుగ్గలు తాకేయి.

వరలక్ష్మికి నవ్వొచ్చింది. 'దొంగముండా' అనేశాడు. వాడి ప్రేమస్థాయి అదా. తప్పేనా మరి తనది? అతన్ని తలుచుకుని... ఏదో ఊహించుకునేది. తన చేతిలో లేదు మనసు పరుగులు తీస్తోంది. కోరిక అనే బలమైన ఊహ... శరీరాన్ని లొంగ తీసుకొంటోంది. ఈ సృష్టిలో ప్రతిప్రాణికీ ఉండే సహజమైన, సాధారణమైన కోరిక తనను చుట్టుముడితే తనేం చేయగలదూ? పలుపుతాడు కట్టి దొడ్లో కట్టిపడేసిన పశువుకి మల్లే, పసుపు తాడొకటి తన మెళ్లో కట్టి ఇంట్లో పడేసి, పాపం, సంఘం, ద్రోహం, ఈ ముళ్లకంచె నడుమ... నా ఇల్లాలితనానికి ఏం అర్థం చెప్పాలి? ఈ గాయాలకు ఏ లేపనం పూయాలి.

వరలక్ష్మి కళ్లు జలజలమని వర్షించాయి.

'ఇంకెప్పుడూ పిచ్చి పిచ్చి ఆలోచనలు చేయకూడదు. మనసుని ఇంకోవైపుకి మళ్లించుకోవాలి. పోనీ సుబ్బమ్మగారు చెప్పినట్లు ధ్యానమో ఏదో చేయాలి.

ఆలోచనలతోనే తెలతెలవారింది. వంటింటి గది తలుపులు తీసుకుని శారద లోపలికి వచ్చింది. వస్తూనే వరలక్ష్మి వళ్లో తల దాచుకుంది. నవ్వుతో, సిగ్గుతో ఆ పిల్ల బుగ్గలు ఎర్రబడిపోయి వున్నాయి. భావోద్రేకం తట్టుకోలేనట్లు ఆ పిల్ల రెండు చేతులూ పిన్ని మెడలో వేసింది. వరలక్ష్మి శారదను వళ్లోకి తీసుకుంది.

చిక్కుపడిన తన వెంట్రుకల నిండా నక్షత్రాలు కూర్చినట్టు మల్లెపువ్వులు అస్తవ్యస్తమైన చీరె ఆదరాబాదరా చుట్టుకున్న ఛాయలు.

వరలక్ష్మి చూస్తూ వుండగానే బుగ్గలు వేడెక్కాయి. శారదను దగ్గరకు తీసుకున్న చేతులు వణికాయి.

అతను శారదను ఎల్లా చుట్టేసేడో...

ఒక్కసారి ఆ గదినీ... శారద సంబరానికి కారకుడైన అతన్ని చూడాలనిపించింది.

"లేమ్మా... శారదా లే... ముఖం కడుక్కో. అందరూ లేస్తారు. స్నానం చేసి చీరె మార్చుకో. నేను అబ్బాయికి కాఫీ ఇస్తా."

లేచి ఉత్సాహంగా కాఫీ గిన్నె స్టవ్ మీద పెట్టింది వరలక్ష్మి. కిటికీ లోంచి పల్చని వెలుగొస్తోంది. తెలవారుతోంది.

వరలక్ష్మి కాఫీ గ్లాసుతో గది తలుపులు నెట్టింది.

మంచంమీద అడ్డదిడ్డంగా పడుకుని నిద్రపోతున్నాడతను. శారద మొగుడు. జారిన దుప్పటీ... శారద కింద వదిలేసిన నలిగిన మల్లెచెండూ. వరలక్ష్మికి గుండెను ఎంత వద్దు వద్దని బతిమిలాడినా జల్లుమనేసింది.

నే రాయినయిపోతే బావుణ్ణు... ఆలోచనలు రాని పిచ్చిదాన్నయితే బావుణ్ణు... వరలక్ష్మి ఆలోచన అక్కడితో ఆగింది. పిచ్చిదాన్నయితే అవునవును పిచ్చిదాన్నయితే.. నవ్వటం మొదలెట్టింది.

వరలక్ష్మి... నలభై అయిదో ఏట ఆవిడ కళ్లు మూసేదాకా పాపం ఆగనే లేదా నవ్వు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 28 డిసెంబర్ 1997*